# అలివేణి

రచన: "లతిక"




అలివేణి పుట్టింది. రంగయ్యని అదృష్టం వరించింది. అతను పట్టింది బంగారం. మాలచ్చిమి రంగయ్య తోబుట్టువు. ఆమె సంతానం సూరిగాడు. వాడు పుట్టేడు మాలచ్చిమికి పసుపు కుంకుమలు కఱవయాయి.

అన్నపంచనచేరింది. కొన్నాళ్ళకి అలివేణి పుట్టింది. మాలచ్చిమి కోడల్ని చూసుకుని మురిసిపోయింది. కాని ఆమెకి అలివేణి ఆటపాటలు చూసే అదృష్టంలేదు. అనతికాలంలోనే మగణ్ణి చేరుకుంది తెలిసీ తెలియని వయసులో అలివేణి, అత్తయ్యకోసం అందరితోపాటూ కళ్ళూ వాచేలా యేడ్చింది.

సూరిగాడు దిక్కులేని వాడయేడు. అలివేణి తల్లి రంగమ్మకి సిరిసంపదలే అఱవ ప్రాణం. సూరిగాడిపోషణ ఆమెకి సుతరామూ గిట్టలేదు. వాణ్ణి పరిపరివిధాల కష్టపెట్టింది. తల్లిగారాబంతోముద్దుగాపెరిగిన సూరికి రంగమ్మ శిక్షణ భరింపరానిదయింది. ఒక నిశిరాత్రి యెవరితోనూ చెప్పకుండా యెక్కడికో వెళ్ళిపోయాడు.

రంగయ్య వెదికించబోయాడు. భార్య వారించింది. లక్ష్యపెట్టలేదు. కాని సూరిగాడి జాడతెలియలేదు. చేసేదిలేక రంగయ్య ఊరుకున్నాడు

* * *

కొన్నేళ్ళు గడిచేయి, అలివేణితప్ప అంతా సూరిగాణ్ణి మరిచిపోయారు.

అలివేణి అందచందాలు, గుణగణాలూ చూసి చాలామంది ఆమెను తమయింటి కోడలిగా తెచ్చుకోవాలని అభిలషించేరు.

రంగయ్య అంతర్యమేమిటో యెవ్వరికీ తెలియదు. రంగమ్మ ఏసంబంధంచేస్తే బాగుంటుందో ఒక నిర్ణయానికి రాలేకపోయింది.

పెళ్ళిప్రసక్తిరాగానే అలివేణికి అత్తయ్య మరణసన్నివేశం లీలగా గోచరించింది. దిగులుతో, కన్నీళ్లతో మాలచ్చిమి సూరిగాణ్ణి రంగయ్యకి అప్పగించింది వాడికి అలివేణినిచ్చి పెళ్ళిచెయ్యమంది. చేస్తానన్నాడు రంగయ్య. చేతిలో చెయ్యివేసి ప్రమాణం చేశాడు. అంతే మాలచ్చిమి తృప్తిగా యీ లోక యాత్ర ముగించింది.

ఇది గుర్తుకురాగానే అలివేణి కళ్ళు చెమ్మగిల్లేయి. శరీరమంతాపులకరించింది. తల్లిమీద కోపంవచ్చింది. ఒళ్ళూపై తెలయని ఆవేశంతో సూరయ్య బావనితప్ప మరొకణ్ణి చస్తే చేసుకోనని చెప్పేసింది. తల్లి తెల్లబోయింది. తండ్రి నెమ్మదిగా వీధిలోకి వెళ్ళిపోయాడు. అలివేణి యేడుస్తూ మూర్ఛిల్లింది.

* * *

సుకుమార్ భోగభాగ్యాలతో తులతూగే లక్షాధికారిబిడ్డడు, అతని ఏకైకపుత్రుడు అంచగాడు, పై చదువులకి బస్తీ వెళ్ళేడు. చదువు ముగించి ఊళ్ళో అడుగుపెట్టగానే అలివేణి కనిపించింది. అతను అలివేణిని చూసి మనసుపడ్డాడు. తనతల్లితో చెప్పేడు. ఆమె ఒప్పుకుంది. రంగమ్మకి కబురుచేసింది. రంగమ్మ సంబరపడింది. అలివేణి మనసు కష్టపడింది. తల్లి తనమాట ఎలాగూ వినదు. తండ్రితో చెప్పుకుంది. "ఎక్కడున్నాడో తెలియని నీ బావకోసం ఎంతకాలమిలా పెళ్ళి లేకుండా వుంటావు ? మాకుమాత్రం నువ్వు తప్ప మరెవరున్నారు ? మేంతప్ప నీ బాగు కోరే వారెవరు ? నీ సుఖంతప్ప మాక్కావలసిందేమిటి? వాడు మరిరాడు. ఈ యవ్వనం కలకాలం నిలవదు. చేతులుకాలేక ఆకులు పట్టుకుని లాభంలేదు. ఎలా వ్రాసివుంటే అలానే జరుగుతుంది. మనస్సుని సమాధానపరుచుకో. వస్తున్న సంబంధాలలో నీకు నచ్చినవారితో పెళ్ళి జరిపిస్తాను. నా మాట కాదనకు" అప్యాయంగా ఉపదేశించాడు తండ్రి.

అలివేణికి బావ వస్తాడని కొండంత ఆశ. ఆ ఆశ నెరవేరింది సూరయ్యవచ్చాడు అలివేణీ అని నోరారా పిలిచేసరికి ఆమె బ్రహ్మానందంపొందింది. ఇష్టదైవాన్ని తలుచుకొని వేనవేలు నమస్కారాలు చేసింది.

రంగమ్మ గొంతుకలో పచ్చివెలగకాయ పడింది. మనస్సులో సూరిగాణ్ణి లక్షలక్షలు తిట్టిపోసింది.

రంగయ్య చెల్లెలికిచ్చిన మాట నిలబెట్టుకున్నాడు. వైభవంగా పెళ్లిజరిపించాడు. అలివేణి అభీష్టం నెరవేరింది. అల్లుణ్ణి తమ యింటనేవుండమన్నాడు రంగయ్య. రంగమ్మ నోరు విప్పలేదు. ఆమె వాలకం సూరికి నచ్చలేదు. మామమాట కాదనలేక ఔననలేక సందిగ్ధంలోపడ్డాడు. అలివేణికి మగనిమనసు అర్థమైంది.

కలిమి శాశ్వతంకాదని, కలిగినంతలో కాపరం చక్కబెట్టుకుంటామని, తమకోసం తల్లడిల్లవద్దని కన్నవారికి చెప్పింది. కట్టుకున్నవానితో కట్టుబట్టలతో బయల్దేరింది.

అలివేణిమీది వ్యామోహంతో సుకుమార్ అలివేణి వెళ్ళినతావు తెలుసుకుని, సూరి యింట్లో లేనిసమయంకోసం పొంచి ; అహల్యను పొందగోరే ఇంద్రునిలా ఆమెను దాపురించాడు తనతో వచ్చేస్తే దేవేంద్రసౌఖ్యం సమకూరుస్తానన్నాడు. బంగారు పూలతో పూజిస్తానన్నాడు.

అలివేణి అన్నదంతా విన్నది. "చెప్పినట్టు నడుచుకుంటావా?" అని అతని కళ్లలోకి

చూస్తూ అడిగింది. నువ్వేం చెయ్యమంటే అది చేస్తానన్నాడతను. "నన్ను మర్చిపో. మరొక చిన్నదాన్ని వరించి కలకాలం వర్ధిల్లు. నేను బ్రతకాలని నీకుంటే నే చెప్పినట్టు చెయ్యి."

సుకుమార్ నిష్క్రమించాడు. ఏడాది నాటికి ముద్దబంతిపువ్వులాటి కూతుర్ని కని, ముచ్చటగా అలివేణి అని పేరుపెట్టుకున్నాడు.

అలివేణికిది తెలిసింది. తన బావకి చెప్పింది. వేదాంతిలా నవ్వి చెప్పేడు.



"నువ్వు దేవతవి అలివేణీ! మీఅమ్మ చేయించే వెట్టిచాకిరితో విసుగెత్తి పారిపోయాను. దొంగ తనం నేర్చుకున్నాను. నీ కోసం చెప్పలేనన్ని దొంగతనాలుచేశాను. మొయ్యలేనన్ని నగలు సంపాదించాను.

నువ్వు మీ అమ్మలాగే సిరిసంపదలంటే ప్రాణం పెడతావనుకున్నాను. నిన్ను చూశాక ఆ అభిప్రాయం మార్చుకున్నాను. నేను దొంగిలించిన బంగారమంతా దేవుడిగుడిలో పడేశాను. మరి దొంగతనం చెయ్యనని దేవుడి సాక్షిగా ప్రమాణంచేశాను.

కాని అలివేణీ! ఇదివరకు నేను చేసిన పాపానికి ప్రాయశ్చిత్తమేమిటి? నా తప్పు నీవు దిద్దగలవా?" అని ప్రాధేయపడ్డాడు.

అలివేణి అంతావింది మొగుణ్ణి తీవ్రంగా చూసింది. సూరి నీరుగారిపోయాడు. ఇలా చూస్తున్నది తన అలివేణేనా? ఎంత భయంకరంగావున్నాయా చూపులు? అదేమిటి? మధ్యన తన కెందుకూ యేడుపు? ఏంచేసే అది పూరుకుంటుంది? తనేం చెయ్యాలి? ఏంచెయ్యాలో చెప్పమని బ్రతిమాలాడు

ఆమె చీరచెంగుతో కళ్ళు తుడుచుకుంది. తప్పకుండా చేస్తానంటే చెయ్యవలసింది చెబుతానంది.

"నీ సాక్షిగా నువ్వేంచెబితే అది చేస్తాను"

"నువ్వు రోజుకెంత సంపాదిస్తున్నావు?"

"కనీసం రూపాయిన్నర"

"మరి తేలేవా?"

"కష్టంమీద రోజుకి రెండు దొరుకుతాయి"

"ప్రతిరోజూ తేగలవా?"

"తెస్తాను తప్పకుండా తెస్తాను"

"ఆ డబ్బుతో దేవుడికి నెయ్యికొని దీపారాధనచెయ్యి"

"మరి మన మేమిటి తింటాం?"

"నీ దొంగతనంవల్ల డబ్బు పోయినవాళ్ళు యేంచేస్తున్నారు?"

"అడుక్కుంటున్నారేమో!"

"రేపటినుంచి నేను ముష్టికి వెళ్తాను"

"నాపాపానికి నీకు శిక్షా? వద్దలివేణీ వద్దు!"

"నీనుంచి యెందరో ముష్టెత్తుకుంటున్నారు. ఆపని నేను చేస్తే యేం?"

"నీ మనసు మారదా?"

"నువ్వు అది తప్పుతావా?"

"నువ్వు చెప్పినట్టే నడుచుకుంటా! కాని నువ్వు అడుక్కుందికి వెళ్లకు. నిన్ను బతిమాలుకుంటాను. ఎలాగో నేనేకష్టపడుతాను."

సూరి అలివేణికిచ్చిన మాటప్రకారం నడుచుకున్నాడు. ఈ కబురువిన్నవాళ్ళు ముక్కున వేలేసుకొని ఆశ్చర్యపడ్డారు.

అలివేణి చక్కదనాలబిడ్డణ్ణికన్నది. సూరి దీపారాధన చేయిస్తున్నాడు. ఈ వార్త తెలిసి పరుగెత్తుకొచ్చాడు. అలివేణి కళ్ళుమూతలు పడ్డాయి గొల్లుమన్నాడు సూరి.

ఆమె మరణానికి అబాలగోపాలం కన్నీరు మున్నీరుగా విలపించారు.

సూరికి మతి చలించి పిచ్చివాడయేడు. అలివేణి కన్నవారికీసంగతి తెలిసింది. పిల్లణ్ణి తీసుకొని వెళ్లిపోయారు. సుకుమార్ రంగయ్యని ఒప్పించి ఆ బిడ్డను తను పెంచాడు.

సుకుమార్‌కూతురు అలివేణికి 13 వ పుట్టినరోజు. ప్రమాదవశాత్తు దాని బట్టలకి నిప్పు అంటుకుంది. ఆ సమయానికి పిచ్చివాడుగా జీవయాత్రసాగిస్తున్న సూరివచ్చాడు. అలివేణి బట్టలకంటిన జ్వాలల్లో వాడికి తన అలివేణి ప్రత్యక్షమైంది. ఆ బాలికను వాడు గాఢంగా చుట్టివేశాడు. జ్వాలలు శాంతించాయి. చిన్న అలివేణి అగ్నిగండంనుంచి రక్షించబడింది.

సూరికి తెలివి తప్పింది.

సుకుమార్ ఉపచారాలుచేశాడు. కోలుకున్నాడు సూరి. ఎటో చూస్తూ సుకుమార్ని రెండు రూపాయి లడిగాడు. తీసుకొనివెళ్ళిపోయాడు. ఇంతవరకూ అతని జాడ తెలియదు. ★